ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ.03.06.2026 సమయం.13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రేపు , ఎల్లుండి ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో పర్యటిస్తారు.

2. కేంద్ర ప్రభుత్వం ధాన్యం తరహాలోనే మొక్కజొన్నను కూడా సేకరించాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోరారు.

3. ఎన్నికల హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కె. తారక రామారావు ఆరోపించారు.

4. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఈరోజు, రేపు ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది.

**సీఎం**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రేపు, ఎల్లుండి ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో పర్యటిస్తారు. ఈ పర్యటనలో భాగంగా పాలమూరు-రంగారెడ్డి , కల్వకుర్తి, కోయిల్‌సాగర్, భీమా, నెట్టెంపాడు, ఇతర ప్రాజెక్టుల స్థితి , పురోగతిపై పవర్‌పాయింట్ ప్రజంటేషన్ లో పాల్గొంటారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటు పలువురు మంత్రులు పాల్గొంటారని నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఆయన నిన్న హైదరాబాద్ లో సంబంధిత అధికారులతో నీటి పారుదల ప్రాజెక్టులపై సమీక్షించారు. సాధ్యమైనంత త్వరగా

ప్రాజెక్టులను పూర్తి  చేసి సాగునీరు అందిం చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి చెప్పారు.

డెస్క్

**తుమ్మల**

కేంద్ర ప్రభుత్వం  ధాన్యం తరహాలోనే మొక్కజొన్నను సేకరించాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోరారు. మొక్కజొన్న కొనుగోళ్లపై కేంద్ర ప్రభుత్వ అనుసరిస్తున్న నిర్లిప్త ధోరణి కారణంగా రాష్ట్రంపై   పెద్ద ఎత్తున భారం పడుతోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. మొక్కజొన్న కొనుగోలు , రవాణా, నిల్వ, నిర్వహణ తదితర వ్యయాలను కలుపుకొని ప్రభుత్వం టన్నుకు  29 వేల  272  రూపాయలు ఖర్చు చేసిందని , అయితే అమ్మకాల్లో  ఆ మేరకు ధర రాక ఒక్క వానాకాలం సీజన్‌లోనే ప్రభుత్వం    400 కోట్ల రూపాయల మేర నష్ట పోయిందని ఆయన నిన్న హైదరాబాద్ లో చెప్పారు. ఇలా ఉండగా  , రాష్ట్రంలోనే అతిపెద్దదైన వరంగల్ ఎనుమాముల మార్కెట్‌యార్డుకు  16 మందితో పాలకవర్గాన్ని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిన్న ఉత్తర్వులు జారీ చేసింది.

డెస్క్

**ధాన్యం కొనుగోలు**

రాష్ట్రంలో రబీ సీజన్ లో  ఈనెల 1వ తేదీ నాటికి    66 లక్షల టన్నుల  ధాన్యం కొనుగోలు చేసినట్లు పౌరసరఫరాల సంస్థ తెలిపింది. రోజుకు సగటున 1.8 లక్షల టన్నులు కొనుగోలు చేస్తున్నట్లు ఒక ప్రకటనలో తెలిపింది.  నారాయణపపేట, భద్రాద్రి-కొత్తగూడెం, నిజామాబాద్, జోగులాంబ గద్వాల, నల్లగొండ జిల్లాలు ధాన్యం సేకరణ తొలి అయిదు స్థానాల్లో ఉన్నాయని ఆ సంస్థ వివరించింది. రాష్ట్రంలో 8   వేల 575 కొనుగోలు కేంద్రాలకు గాను 2    వేల  870 కేంద్రాలను మూసి వేసినట్లు తెలిపింది.

డెస్క్

**కేటీఆర్**

రాష్ట్రంలో ఎన్నికల హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, 420 హామీలలో ఒక్కటి కూడా అమలు చేయలేదని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కె. తారక రామారావు ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఆర్థికంగా అగ్రస్థానంలో ఉన్న రాష్ట్రం ఇప్పుడు తిరోగమనంలో సాగుతోందని అన్నారు. ఆయన ఈరోజు హైదరాబాద్ లో విలేకరులతో మాట్లాడుతూ.... ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం చూపుతున్న అలసత్వం కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగుండలేదని చెబుతూనే, ప్రభుత్వం ప్రచారానికి పెద్ద మొత్తంలో ఖర్చు చేస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రెండున్నరేళ్లలో 4 లక్షల కోట్ల రూపాయలు అప్పు చేసిందని, ఆ మొత్తానికి లెక్కలు లేవని ఆయన ఆరోపించారు. అప్పులు చేయడంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం రికార్డు సృష్టిస్తోందని ఆయన వ్యాఖ్యానించారు.

**డెస్క్/పిటిసి, హైదరాబాద్**

**సర్...ఈసీ**

రాష్ట్రంలో ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను అయిదు దశల్లో  పూర్తి చేయవలసి ఉందని కేంద్ర ఎన్నికల సంఘం  ముఖ్య కార్యదర్శి అవినాశ్ కుమార్ చెప్పారు.  సర్ మూడవ దశ సన్నద్ధతపై ఆయన నిన్న హైదరాబాద్ లో సమీక్ష నిర్వహించారు. జనగణను నేరుగా , ఆన్ లైన్ ద్వారా సేకరించాలని , అభ్యంతరాలు , ఫిర్యాదులు స్వీకరించి పరిష్కరించాలని సూచించారు. ఓటర్ల కోసం తెచ్చిన 'బుక్ ఎ కాల్' సదుపాయంపై విస్తృత ప్రచారం చేయాలని ఆయన తెలిపారు. రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రంలో ఇంత వరకు 68.30 శాతం మ్యాపింగ్ పూర్తయిందని తెలిపారు.  ఈసీఐ ఉప కార్యదర్శి సంజయ్ కుమార్, తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.  ఇలా ఉండగా , ఓటరు జాబితా ప్రక్రియ 'సర్'పై ప్రజల్లో అవగాహన కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు కలెక్టర్లను ఆదేశించారు. అందులో భాగంగా రేపు , 6, 9, 10 తేదీల్లో గ్రామ , వార్డు సభలు నిర్వహించనున్నట్లు తెలియజేశారు.

డెస్క్

**పురస్కారాలు**

జాతీయ పంచాయతీ పురాస్కారాలు- 2025 ప్రదానోత్సవం ఈరోజు న్యూఢిల్లీలో జరుగుతుంది. దేశ వ్యాప్తంగా ఎంపికైన 42 అత్యుత్తమ పంచాయతీలకు ఈ పురస్కారాలను ప్రదానం చేస్తారు. మన రాష్ట్రానికి సంబంధించి వికారాబాద్ జిల్లా , కోట్ పల్లి మండలం , మొతుకుపల్లె గ్రామ పంచాయతీ సుపరిపాలన విభాగంలో 3వ ర్యాంకు సాధించి 50 లక్షల రూపాయల బహుమతికి ఎంపికైంది. సంగారెడ్డి జిల్లా, ఫసల్ వాడీ గ్రామ పంచాయతీ మహిళా ప్రయోజన విధానాల విభాగంలో మూడవ ర్యాంకుతో 25 లక్షల రూపాయల బహుమతికి ఎంపికైంది

డెస్క్

**పాఠశాలలు**

మహబూబాబాద్ జిల్లాలోని 18 మండలాల పరిధిలో 76 ప్రీప్రైమరీ పాఠశాలలు మంజూరయ్యాయని జిల్లా విద్యాశాఖ అధికారి సత్యనారాయణ మూర్తి తెలిపారు. ప్రతి పాఠశాలలో ఒక బోధకుడు , ఆయా ఉంటారని , బోధకుడి ఉద్యోగానికి ఇంటర్మీడియట్ లేదా సమాన అర్హత , ఆయా ఉద్యోగానికి 7వ తరగతి విద్యార్హతగా నిర్ణయించామని వివరించారు. ఆసక్తి గల వారు ఈ నెల 6వ తేదీలోగా సంబంధిత మండల కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన పేర్కొన్నారు.

**పీటీసీ.. మహబూబాబాద్**

**పశువైద్యశాల**

హన్మకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని ముల్కనూర్ ఏరియా పశువైద్యశాల నూతన భవన నిర్మాణానికి ప్రభుత్వం 70 లక్షల రూపాయలు కేటాయించిందని రవాణా , బీసీ సంక్షేమ

శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. త్వరలోనే పనులు ప్రారంభమవుతాయని ఆయన పేర్కొన్నారు.

**పీటీసీ, వరంగల్**

**పర్యావరణ పరిరక్షణ**

వినియోగాన్ని తగ్గించినప్పుడే పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని ఆసిఫాబాద్ జిల్లా అటవీ శాఖ అధికారిని బాలమణి అన్నారు. ఒకసారి వాడి పారేసే ప్లాస్టిక్ వల్ల పర్యావరణానికి, వన్యప్రాణులకు, మానవ ఆరోగ్యానికి హాని కలుగుతోందని అన్నారు. సిర్పూర్ (టి) మండలం, దుబ్బగూడ గ్రామంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా, ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే నష్టాలు, పర్యావరణ పరిరక్షణపై అటవీ శాఖ ఈ రోజు అవగాహన కార్యక్రమం నిర్వహించింది. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి , వస్త్ర సంచులు, పర్యావరణహిత ప్రత్యామ్నాయాలను ఉపయోగించాలని సూచించారు.

**పీటీసీ...ఆసిఫాబాద్**

**సర్వైకల్**

నల్గొండ జిల్లాలో హెచ్‌పీవీ వ్యాక్సిన్ 100 శాతం లక్ష్యాన్ని ఈ నెలఖరు నాటికి పూర్తి చేస్తామని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారిని పద్మ తెలిపారు. పాఠశాలలు పునఃప్రారంభం తర్వాత అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా ఈ వ్యాక్సిన్ అందజేస్తామని చేప్పారు. కిశోర బాలికల గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌ను నిరోధించేందుకు ఈ వ్యాక్సిన్ కార్యక్రమాన్ని మార్చి 8వ తేదీన ప్రారంభించారు. జిల్లాలో 14-15 మధ్య వయసు గల బాలికలు 18 వేల మంది ఉండగా.. ఇప్పటి వరకు కేవలం 3 వేల మంది ఈ వ్యాక్సిన్ తీసుకున్నారని ఆమె తెలిపారు. జిల్లాకు మొత్తం 8 వేల యూనిట్ల వ్యాక్సిన్ రాగా.. ప్రస్తుతం మరో 5 వేల యూనిట్ల వ్యాక్సిన్ అందుబాటులో ఉందని చెప్పారు.

**పీటీసీ.. నల్గొండ**

**వాతావరణం**

రాష్ట్రంలో పలు జిల్లాల్లో ఈరోజు  , రేపు ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. ఉరుములు , మెరుపులతో ఈదురు గాలులు వీస్తాయని హెచ్చరించింది. ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, వరంగల్, నల్లగొండ, ఖమ్మం జిల్లాలకు ఆరెంజ్, మిగతా జిల్లాలకు ఎల్లో అలెర్ట్   జారీ చేసింది. కాగా , రేపటి లోగా కేరళ , తమిళనాడులను నైరుతి రుతు పవనాలు తాకే అవకాశాలు ఉన్నట్లు కూడా వాతావరణ శాఖ పేర్కొంది. నిన్న ఖమ్మం జిల్లా , ఏన్కూరు మండలంలో  7.9 సెం.మీ వర్షపాతం నమోదైంది. సూర్యాపేట జిల్లా, గరిడేపల్లిలో 44.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

**డెస్క్**

**కాలువ మరమ్మతులు**

మహబూబాబాద్ జిల్లా, నెల్లికుదురు మండలం, కాచిగల్ గ్రామం వద్ద కట్టు కాలువకు 49.65 లక్షలతో చేపట్టే మరమ్మతు పనులను శాసన సభ్యుడు డాక్టర్ భూక్య మురళి నాయక్ ఈరోజు ప్రారంభించారు. కాచిగల్-ఎర్రబెల్లి గ్రామాల మధ్య దెబ్బతిన్న రహదారికి కూడా త్వరలో మరమ్మతులు చేపడతామని ఆయన ఆ సందర్భంగా చెప్పారు.

**పీటీసీ – మహబూబాబాద్**